మంగళవారం
23-7-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 402 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




దేశంలో పెరుగుతున్న స్థూలకాయం

మిగతా 3లో



రైల్వే ట్రాక్‌పై కూర్చొని పాటలు వింటున్నారు

మిగతా 3లో



ప్రతి నిమిషం ఫోన్ చెక్ చేస్తున్నారా..

మిగతా 5లో



నిర్మాత దిల్ రాజు సూపర్ ఎస్కేప్

మిగతా 5లో

# పేర్లు కాదు ఆహారాన్ని ప్రదర్శిస్తారు

- కావడి యాత్రపై సుప్రీం కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా

ముందడుగు ఢిల్లీ:

ఉత్తరప్రదేశ్‌లో కొనసాగే కావడి యాత్ర మార్గం వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, తోపుడుబండ్ల ముందు వాటి యజమానుల పేర్లు, వ్యక్తిగత వివరాలతో బోర్డులు పెట్టాలంటూ ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఆ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించింది. యజమానులు వారు వడ్డించే ఆహారాన్ని మాత్రమే ప్రదర్శిస్తారని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

ఈ సందర్భంగా పిటిషనర్లు తమ వాదనను వినిపించారు. ''అసలైన ఉద్దేశం కనిపించకుండా మభ్య పెడుతూ ఇచ్చిన ఆదేశాలు ఇవి. నేమ్‌ప్లేట్స్ ప్రదర్శించకుండా ఈ ఆదేశాలను ఉల్లంఘించినవారికి జరిమానా విధిస్తారు. ఎవరు మనకు వడ్డిస్తున్నారని కాకుండా.. తినాలనుకుంటున్న ఆహారాన్ని బట్టి మనం రెస్టారెంట్‌కు



వెళ్తాం. గుర్తింపును బట్టి దూరం పెట్టే ఉద్దేశమే ఈ ఉత్తర్వుల్లో కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం'' అని వారి తరపున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు వెల్లడించారు. ''గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఈ ఆదేశాలకు ఎలాంటి చట్టబద్ధత లేదు. పోలీస్ కమిషనర్‌కు వీటిని జారీ చేసే అధికారం ఏ చట్టమూ ఇవ్వలేదు'' అని మరో న్యాయవాది వాదించారు.



# నీట్‌లో ఒక ప్రశ్నకు రెండు సమాధానలా..

- ఏది సరియైన సమాధానమో చెప్పండి
- ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు సుప్రీం ఆదేశం

ముందడుగు జాతీయం:

దేశంలో జరిగిన నీట్-యూజీ 2024 పరీక్ష పత్రం లీకేజీ, అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా నీట్- యూజీ పరీక్షలో వచ్చిన ఓ ప్రశ్న విషయంలో తీవ్ర చర్చ జరిగింది. ఒకే ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చారని, మార్కులు మాత్రం ఒక్కదానికే వేశారంటూ పిటిషనర్లు వాదించారు. దానికి మార్కులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మెరిట్ లిస్టు మారే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. సదరు ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత సబ్జెక్టుకు చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటు

మిగతా 2లో

# పార్లమెంట్ రాజకీయాలు చేయడానికి కాదు

- రైతులు, యువత జీవితాలను బాగుచేయాలి
- ప్రతిపక్షాలకు ప్రధాని మోడీ హితవు

ముందడుగు ఢిల్లీ:

మనకు పార్లమెంట్ వేదిక ఉంది రాజకీయాలు చేయడానికి కాదని.. దేశం కోసం ఉందని ప్రధాని మోడీ ప్రతిపక్షాలకు హితవు పలికారు. నేడు పార్లమెంట్ సమావేశాలకు ముందు ఆయన మాట్లాడుతూ ''మనం 2029 ఎన్నికల్లో మరోసారి తలపడదాం. అప్పటివరకు పార్లమెంట్‌ను మహిళలు, రైతులు, యువత జీవితాలను

మిగతా 2లో





# బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రతిపాదన లేదు

తాజాగా వెల్లడించిన కేంద్రప్రభుత్వం

ముందడుగు జాతీయం:

కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో భాగమైన జనతాదళ్-యునైటెడ్ (జేడీయూ) బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్

మిగతా 2లో

ముందడుగు
మంగళవారం, 23-7-2024, హైదరాబాద్

# రాజీనామా చేసి రా.. ఇద్దరం మళ్లీ పరీక్ష రాద్దాం

## స్మిత సభర్వాల్ వ్యాఖ్యలపై బాలలత

ముందడుగు హైదరాబాద్:
ఒక యువతి IAS కావాలంటే అందగత్తె కావాల్సిన అవసరం లేదని ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ పోస్టు దివ్యాంగులను ఆందోళనకు గురి చేస్తోందని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ బాలలత అన్నారు.

సోషల్ మీడియాలో ఆమె పెట్టిన పోస్టు "దివ్యాంగులను దూరం పెట్టమని స్మిత చెబుతున్నారు. రేవంత్ సర్కారు తొలి ఉద్యోగం దివ్యాంగురాలికి ఇచ్చింది. దివ్యాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరం. స్మితా సభర్వాల్.. మీరు రాజీనామా చేసి రండి.. ఇద్దరం మళ్లీ పరీక్ష రాద్దాం.. మనిద్దరిలో ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దాం. ఆమె ఫిజికల్లీ ఫిట్.. మెంటల్లీ




అన్‌ఫిట్. 24 గంటల్లో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. లేదంటే జైపాల్‌రెడ్డి స్మృతివనం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపడతాం. ఆమెపై సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి తగిన చర్యలు తీసుకోవాలి" అని, స్మితకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని బాలలత డిమాండ్ చేశారు.

# తక్కువ ధరలోనే రెండు రీచార్జ్ ప్లాన్స్

- వినియోగదారులను కోసం బిఎస్ఎన్ఎల్ పథకం
- జియో, ఎయిర్‌టెల్, వీఐ కంటే తక్కువ ప్లాన్

ముందడుగు జాతీయం:
భారతప్రభుత్వ టెలికాం కంపెనీ బీఎస్ఎన్ఎల్ బడ్జెట్ ఫ్రెండ్లీ రీచార్జ్ ప్లాన్స్‌ను ఇటీవల ప్రకటించింది. 28 రోజులు, 30 రోజుల వ్యాలిడిటీతో ఈ ప్లాన్స్ బడ్జెట్ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వీఐ వినియోగదారులు చౌకైన రీచార్జ్ ఇచ్చే కంపెనీల గురించి వెతుకుతున్నారు. ఇలాంటి వారికి ఇది గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు.

### రూ.108 ప్లాన్

స్టాండ్‌అవుట్ రీఛార్జ్ ప్లాన్‌లలో భాగంగా రూ. 108తో 28 రోజుల వ్యాలిడిటీతో కొత్త రీచార్జ్ ప్లాన్ మన ముందుకు బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చింది. అదనపు ఛార్జీల గురించి ఎలాంటి చింత లేకుండా అపరిమిత కాలింగ్ సదుపాయాన్ని పొందవచ్చు. అలాగే రోజుకు 1 జీబీ డేటా వస్తుంది. ఒకవేళడేటా అయిపోతే వినియోగదారులు 40 కేబీపీఎస్ వేగంతో బ్రౌజ్ చేయడం కొనసాగించవచ్చు. అయితే ఇది ఫస్ట్ రీఛార్జ్ కూపన్ ప్లాన్ అని గమనించాలి, అంటే ఇది కొత్త నంబర్‌తో మాత్రమే యాక్టివేట్ అవుతుంది. మంచి డేటా, అపరిమిత కాల్‌లతో బడ్జెట్ ఫ్రెండ్లీ నెట్ వర్క్ కోసం చూస్తున్న కొత్త వినియోగదారులు ఈ రీఛార్జ్ ప్లాన్ మంచి ఎంపికగా ఉంటుంది.

### రూ.199 ప్లాన్

బీఎస్ఎన్ఎల్ రూ.199తో 30 రోజుల వ్యాలిడిటీతో కొత్త రీచార్జ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్లాన్ అపరిమిత ఉచిత కాలింగ్‌తో 30 రోజుల చెల్లుబాటును అందిస్తుంది. ఈ ప్లాన్ మొత్తం నెలకు 60 జీబీ డేటాను అందుబాటులో ఉంటుంది. అంటే రోజుకు 2జీబీ డేటాకు అనువదిస్తుంది. అలాగే ఈ ప్లాన్ కింద రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను పొందవచ్చు. ఈ ప్లాన్ ఒక నెల పాటు డేటా, కాలింగ్ ప్రయోజనాలు రెండూ అందిస్తుంది.

# నీట్‌లో ఒక ప్రశ్నకు రెండు సమాధానలా..

(మొదటిపేజీ తరువాయి)
చేసి, జూన్ 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు దానిపై సమాధానం సమర్పించాలని ఐఐటీ- ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. అంతకుముందు ఇదే అంశంపై వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. మే 4కు ముందే పేపర్ లీక్ అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బిహార్ పోలీసుల దర్యాప్తు నివేదికను ప్రస్తావిస్తూ.. స్ట్రాంగ్ రూమ్ నుంచే ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా? అని ప్రశ్నించింది.

# పార్లమెంట్ రాజకీయాలు చేయడానికి కాదు

(మొదటిపేజీ తరువాయి)
బాగు చేసేందుకు వాడదాం" అని పేర్కొన్నారు. సభలో నిరంతరం గందరగోళం వల్ల కొందరు సభ్యులు తమ పాయింట్లను చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చేశారని చెప్పిన మోడీ.. ఇక ఆ రాజకీయాల నుంచి పార్టీలు బయటకువచ్చి దేశం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ అత్యంత కీలకమైందని ప్రధాని మోడీ అభివర్ణించారు. వచ్చే ఐదేళ్లకు తమకు కార్యనిర్దేశం చేసేదిగా ఈ బడ్జెట్ ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వికసిత్ భారత్‌కు ఇది పునాది వేస్తుందని చెప్పారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత మూడోసారి ఒకే ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారు మూడోసారి కొలువుదీరిన తర్వాత తొలిసారి బడ్జెట్‌ను సమర్పించేందుకు పార్లమెంటు సోమవారం నుంచి సమావేశమైంది.

ఈ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి. మంగళవారం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వం ఆరు బిల్లులను సభామోదం కోసం తీసుకురానుంది. కాగా, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రైల్వే భద్రత, కావడి (కన్వర్) యాత్ర మార్గంలో హోటళ్లపై యజమానుల పేర్లు రాయాలనే నిబంధన వంటి అంశాలపై కేంద్రాన్ని ఐక్యంగా నిలదీయాలని విపక్షం భావిస్తోంది. మరోవైపు బడ్జెట్ సమావేశాల కార్యాచరణపై చర్చించేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ప్రభుత్వం దీనిని నిర్వహించింది.

# బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రతిపాదన లేదు

(మొదటిపేజీ తరువాయి)
చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని తాజాగా కేంద్రం వెల్లడించింది. ఆర్థికవృద్ధి, పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు బిహార్‌తో పాటు వెనకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే ప్రణాళిక ఏదైనా ఉందా..? అని జేడీయూ ఎంపీ రామ్‌ప్రిత్ మండల్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. దీనికి ఆ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని పార్లమెంట్ వేదికగా వెల్లడించారు.

ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్డీయే కూటమిలో జేడీయూ కీలకంగా మారింది. 12 మంది సభ్యుల బలంతో కూటమిలో మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. దాంతో ప్రత్యేక హోదా




ప్రతిపాదనను తెర పైకి తెచ్చింది. అదే తమ పార్టీ ప్రథమ ప్రాధాన్యం అని జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఇటీవల వెల్లడించారు. దానిని ఇవ్వడంలో కేంద్రానికి ఏదైనా సమస్య ఉంటే.. తాము ప్రత్యేక ప్యాకేజీని కోరతామని తెలిపారు.

ముందడుగు
మంగళవారం, 23-7-2024, హైదరాబాద్

# రైల్వే ట్రాక్‌పై కూర్చొని పాటలు వింటున్నారు

## పట్టాలపై రైలు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి



ముందడుగు ఉత్తరప్రదేశ్:
ఇద్దరు బాలురు రైల్వే ట్రాక్‌పై కూర్చొని పాటలు వింటుండగా రైలు దూసుకొచ్చి ఢీ కొట్టడంతో మృతిచెందిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌దేపుర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు సమీర్ (15), జాకీర్ అహ్మద్ (16) ఆదివారం సాయంత్రం ఇయర్‌ఫోన్‌లు పెట్టుకుని, రైల్వే ట్రాక్ మీద కూర్చొని పాటలు వింటున్నారు. అదే సమయంలో పట్టాలపై దూసుకొచ్చిన రైలు ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పట్టాలపై మృతదేహాలను గుర్తించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇద్దరూ చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకోవడం వల్ల వారికి రైలు శబ్దం వినిపించకపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# దేశంలో పెరుగుతున్న స్థూలకాయం

- 54 శాతం ఆహారపు అలవాట్లే కారణం
- ఆర్థిక సర్వేలో ఒబెసిటీ అంశం ప్రస్తావన
- నగర జనాభాలోనే స్థూలకాయం ఎక్కువ



ముందడుగు జాతీయం
దేశంలో అత్యధిక చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంతో స్థూలకాయం పెరుగుతోందని ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తమైంది. అత్యధిక చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంపై అప్రమత్తత అవసరమని అభిప్రాయపడింది. దేశంలో 54 శాతం అనారోగ్య సమస్యలకు అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లే కారణమని సర్వే పేర్కొంది. పౌరులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకునేలా దీనికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఒబెసిటీ అంశం ప్రస్తావనకు వచ్చింది.

దేశంలో ఒబెసిటీ ఆందోళనకరంగా మారిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ముఖ్యంగా పెద్దల్లో స్థూలకాయం ఆందోళనకరమని పేర్కొంది. దేశంలో యువ జనాభా నుంచి ప్రయోజనం పొందాలంటే వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు వారిని ఆరోగ్యకరమైన అలవాట్ల వైపు మళ్లించడం కీలకం అని అభిప్రాయపడింది. ఇటీవల ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ వెలువరించిన నివేదికను ఉటంకిస్తూ.. అధిక చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం కూడా విపరీతంగా పెరిగిందని సర్వే తెలిపింది.

ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోవడం అధిక బరువు/ ఒబెసిటీకి కారణమవుతోందని విశ్లేషించింది. పెద్దల్లో స్థూలకాయం మూడింతలు పెరిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. చిన్నారుల్లోనూ ఈ సమస్య వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ విషయంలో వియత్నాం, నమీబియా తర్వాత స్థానంలో భారత్ ఉందంటూ వరల్డ్ ఒబెసిటీ ఫెడరేషన్ నివేదికను ఆర్థిక సర్వే ఉటంకించింది.

### అర్బన్‌లోనే స్థూలకాయం ఎక్కువ..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం.. గ్రామీణ భారతంతో పోలిస్తే నగర జనాభాలో ఈ సమస్య అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో స్థూలకాయ సమస్య 19.3 శాతం ఉండగా.. అర్బన్‌లో ఇది 29.8 శాతంగా ఉంది. 18-65 సంవత్సరాల వయసు కలిగిన పురుషుల్లో స్థూలకాయం సమస్య 18.9 శాతం నుంచి 22.9 శాతానికి పెరిగింది. అదే స్త్రీలలో 20.6 నుంచి 24 శాతానికి పెరిగింది. కొన్ని రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉందని సర్వే అభిప్రాయపడింది. మారుతున్న జీవన విధానమే దీనికి కారణమని విశ్లేషించింది. ఇందుకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీలో మహిళలు 41.3 శాతం మంది స్థూలకాయంతో బాధపడుతుండగా.. పురుషుల్లో ఇది 38 శాతంగా ఉందని పేర్కొంది. తమిళనాడులో పురుష జనాభాలో 37 శాతం, మహిళా జనాభాలో 40.4 శాతం మందికి ఒబెసిటీ ఉందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే పురుషుల్లో 31.1 శాతం, మహిళల్లో 36.3 శాతం మందిని స్థూలకాయం సమస్య వెంటాడుతోందని ఆర్థిక సర్వే పేర్కొంది.

# సతీమణి ఆరోపణలకు దేశ ప్రధానికి సమన్లు

- స్పెయిన్ కోర్టులో జరుగుతున్న విచారణ
- కేసుకు కీలకం కానున్న ప్రధాని సాక్ష్యం

ముందడుగు డెస్క్:
స్పెయిన్ ప్రధాని పెడ్రో షాంచెజ్ సతీమణిపై ఆరోపణలు రావడంతో దేశ ప్రధానికే సమన్లు అందాయి. ఆయన సాక్ష్యం చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం స్పెయిన్ ప్రధాని పెడ్రో షాంచెజ్ సతీమణి బెగొనా గోమెజ్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. తాను నడుపుతోన్న యూనివర్సిటీ మాస్టర్ డిగ్రీ కోర్సుకు స్పాన్సర్ల కోసం ప్రధాని సతీమణి హోదాను ఉపయోగించుకున్నారంటూ గోమెజ్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో సాక్షిగా ప్రధానిని ప్రశ్నించేందుకు విచారణాధికారులు సమన్లు ఇచ్చారు. అధికారిక నివాసంలో జులై 30న ఆయన్ను న్యాయమూర్తి ప్రశ్నించనున్నారు. ఆయన సాక్ష్యం ఈ కేసుకు కీలకం కానుందని



పేర్కొన్నారు. ఇటీవల గోమెజ్ విచారణకు హాజరైనా.. జడ్జి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. అలాగే తనపై వచ్చిన ఆరోపణలకు ఆమె ఇంతవరకు బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ.. పెడ్రో మాత్రం విపక్షాల విమర్శల్ని తోసిపుచ్చుతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ ఆరోపణల కారణంగా ఏప్రిల్‌లోనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని భావించి, తన విధుల నుంచి ఐదు రోజులపాటు బ్రేక్ తీసుకున్నారు. కానీ తర్వాత ఆ ఆలోచనను విరమించుకున్నారు.

# ఐడిబిఐ బ్యాంక్ మొదటి త్రైమాసికం ఆర్థిక ఫలితాలు

ముందడుగు హైదరాబాద్:
ఐడిబిఐ బ్యాంక్ పనేడు ఈ ఆర్థిక సంవత్సవం (FY25) మొదటి త్రైమాసికం (Q1) ఫలితాలను ప్రకటించింది. ఇది Q1 FY25కి నికర లాభం ₹1,719 కోట్లుగా ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి (YYY)40% బలమైన వృద్ధిని నమోదు చేసింది. నిర్వహణ లాభం ₹2,076 కోట్లుగా ఉంది. మొత్తం వడ్డీ రాబడి (NIM) 4.18% వద్ద నమోదు కాగా, Q1-2024లో ₹3,998 కోట్ల నుంచి Q1-




2025లో నికర వడ్డీ ఆదాయం ₹3,233 కోట్లుగా ఉంది. అదే విధంగా Q1-2024లో 4.12%తో పోలిస్తే Q1-2025లో డిపాజిట్ ధర 4.58%గా ఉంది. ఏడాది నుంచి ఏడాదికి 209 bps వృద్ధితో సీఆర్ఏఆర్ (CRAR) 22.42% వద్ద ఉంది. ఆస్తులపై రాబడి (ROA) 1.83%, ఏడాది నుంచి ఏడాదికి వృద్ధి 34 bps మరియు రిటర్న్ ఆన్ ఈక్విటీ (ROE) 19.87% కాగా ఏడాది నుంచి ఏడాదికి ఇది 123 bps వృద్ధి చెందింది. జూన్ 30, 2023 నాటికి 0.44% నుంచి నికర NPA 0.23% మరియు స్థూల NPA జూన్ 30, 2023 నాటికి 5.05% నుంచి 3.87%కు చేరుకుంది.

ముందడుగు
మంగళవారం, 23-7-2024, హైదరాబాద్

# అన్నం కావాలంటే లైంగిక కోరిక తీర్చాలి

- భయానక పరిస్థితుల్లో మహిళలు
- సుడాన్‌లో మహిళల దారుణ దుస్థితి



ముందడుగు డెస్క్:
ఆకలితో అలమటించే మహిళలకు బుక్కెడు అన్నం కావాలంటే ముందుగా సైనికుల లైంగిక వాంఛలు తీర్చాలి. అప్పుడే వారికి ఆహారం లభిస్తుంది. ఆఫ్రికా దేశమైన సూడాన్‌లోని ఒమ్దుర్‌మన్ పట్టణంలోని కొందరు మహిళల దుస్థితి ఇది. ది గార్డియన్ పత్రిక దీనిపై కథనం ప్రచురించింది. ఈ పట్టణంలో జరుగుతున్న అంతర్యుద్ధం వల్ల చాలామంది పారిపోగా.. దాదాపు 24 మంది మహిళలు వారి కుటుంబాలతో సహా చిక్కుకుపోయారు. ఇక్కడ ఆహారం కేవలం సైన్యం వద్ద మాత్రమే లభిస్తోంది. ఇక్కడ ఫ్యాక్టరీల్లోనే వారు అత్యధిక ఆహార నిల్వలు ఏర్పాటుచేశారు. ఇంట్లోని వృద్ధ తల్లిదండ్రులు, పిల్లలకు ఆహారం తీసుకొనేందుకు వచ్చిన మహిళలతో సైనికులు లైంగిక వాంఛలు తీర్చుకొంటున్నారు. ఈ విషయాన్ని బాధిత మహిళలే స్వయంగా మీడియాకు వెల్లడించారు.

### కోర్కెలు తీర్చకుంటే దాడులే

గతేడాది ఏప్రిల్ నెలలో అంతర్యుద్ధం మొదలైన తొలినాళ్ల నుంచే ఈ పరిస్థితి నెలకొంది. అప్పట్లో సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య ఘర్షణ ఈ సివిల్ వార్‌కు దారితీసింది. రెండు వర్గాలు తమను లైంగికంగా వేధిస్తున్నట్లు మహిళలు గగ్గోలు పెడుతున్నారు. అంతేకాదు.. ఖాళీ ఇళ్లల్లో మిగిలిపోయిన వస్తువులను తీసుకోవాలన్నా మహిళలు సైనికుల కోర్కెలు తీర్చాల్సిందే. "ఇటువంటి పరిస్థితి పగవాళ్లకు కూడా వద్దు. కేవలం నా బిడ్డల ఆకలి తీర్చడానికే నేను వారు చెప్పినట్లు చేయాల్సివచ్చింది" అని ఓ మహిళ ది గార్డియన్ పత్రిక వద్ద వాపోయింది. కొందరు సైనికులు పాడుబడిన ఇళ్ల వద్దకు మహిళలను తీసుకొచ్చి వరుసగా నుంచోపెట్టి.. నచ్చినవారిని ఎంచుకొంటున్న దృశ్యాలను తాము చాలా చూశామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 21 ఏళ్ల ఓ మహిళ సైనికులు చెప్పినట్లు చేయడానికి అంగీకరించకపోవడంతో ఆమె కాళ్లకు నిప్పుపెట్టారని స్థానికులు వివరించారు.

## సివిల్స్ నాలుగుసార్లు ర్యాంక్ వచ్చినా
# ఉద్యోగం ఇవ్వలే

- దివ్యాంగుడనే కారణంతోనే పక్కన పెట్టారు
- కార్తీక్ స్టోరీని ట్విట్టర్‌లో షేర్ చేసిన రిటైర్డ్ ఐఏఎస్

ముందడుగు జాతీయం:
ఒక దివ్యాంగుడు సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని అందులో అర్హత సాధించాడు. నాలుగుసార్లు సివిల్స్‌లో ర్యాంకు పొందాడు కానీ అతడికి ఉద్యోగం మాత్రం రాలేదు. క్ డిజెబిలిటీ సర్టిఫికెట్తో సివిల్స్ ఉద్యో గం పొందిన పూజా ఖేద్కర్ వివాదం వేళ.. అర్హుడైన కార్తీక్ కన్సాల్‌కు అన్యాయం జరిగిందంటూ ఆయన స్టోరీ సోషల్ మీడియాలో వైరల్గా మారింది. కార్తీక్ స్టోరీని రిటైర్డ్ ఐఏఎస్ సంజీవ్ గుప్తా ట్విట్టర్లో పోస్టు చేశారు.





### సివిల్స్ లక్ష్యాన్ని చిదిమేస్తున్నారు

కార్తీక్ కన్సాల్ ఐఐటీ రూర్కీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ఆ తర్వాత సివిల్స్కు ప్రిపేర్ అయ్యాడు. 2019లో 813వ ర్యాంక్ సాధించాడు. అప్పుడు మొత్తం 15 లోకోమోటర్ డిజెబిలిటీ ఖాళీలు ఉండగా 14 పోస్టులను భర్తీ చేశారు. కార్తీక్కు ఉద్యోగం రావాల్సి ఉండగా రాలేదు. 2021లో కార్తీక్ 271వ ర్యాంక్ సాధించాడు. ఆ నోటిఫికేషన్లో ఏడు లోకోమోటర్ డిజెబిలిటీ పోస్టులు ఉండగా, నాలుగింటిని భర్తీ చేశారు. ఆ కేటగిరీలో కార్తీక్ ఫస్ట్ ప్లేసులో ఉన్నప్పటికీ ఉద్యోగం ఇవ్వలేదు. ఇక 2022లో 784, 2023లో 829వ ర్యాంకులు సాధించినా యూపీఎస్సీ ఉద్యోగం ఇవ్వలేదు. దీనిపై కార్తీక్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ను ఆశ్రయించారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. కాగా, ప్రస్తుతం కార్తీక్ ఇస్రోలో సైంటిస్ట్గా పని చేస్తున్నాడు.

### 60శాతమే డిజెబిలిటీ కానీ

కార్తీక్ మస్కులర్ డిస్ట్రోఫితో బాధపడుతున్నాడని ఎయిమ్స్ మెడికల్ బోర్డు నిర్ధారించింది. డిజెబిలిటీ 60 శాతమేనని సర్టిఫికెట్లో ఉంది కానీ అది 90 శాతమని పేర్కొంది. కార్తీక్ చూడడం, వినడం, రాయడం, మాట్లాడడం అన్నీ చేయగలడు.. కానీ నిలబడలేడని తెలిపింది. యూపీఎస్సీ రూల్స్ ప్రకారం.. ఐఏఎస్కు మస్కులర్ డిస్ట్రోఫి ఉన్నోళ్లు అనర్హులు. 'నిపుణుల సూచన మేరకు ఫంక్షనల్, ఫిజికల్ అర్హతలను బట్టి దివ్యాంగులకు సర్వీసులను కేటాయిస్తాం. కార్తీక్ ర్యాంక్, అర్హతలను బట్టి.. ఆయన ఏ సర్వీస్కు సరిపోలేదు' అని యూపీఎస్సీ పేర్కొంది.

# నేడు కేంద్ర బడ్జెట్

ముందడుగు జాతీయం:
2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టనున్నది. దీంతో వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలువనున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ దఫా బడ్జెట్‌కు ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఏయే కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తారు? మధ్యతరగతికి ఆదాయ పన్ను ఉపశమనం ఉంటుందా? జనాకర్షక స్కీమ్‌లు ఏముంటాయి? అనే అంశాలపై చర్చ నడుస్తున్నది. మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ, గత రెండు పర్యాయాలతో పోలిస్తే లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీట్ల సంఖ్య తగ్గిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిత్రపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఉంటాయా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కొత్త పద్దులో వృద్ధికి ఊతమివ్వడమే కాకుండా ద్రవ్యోల్బణం కట్టడిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### నిర్మలకు వరుసగా ఏడో బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఇది వరుసగా ఏడో బడ్జెట్. తద్వారా ఆరుసార్లు వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె అధిగమించనున్నారు. మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరుపై ఉన్నది. ప్రధానులుగా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి హయాంలలో ఆయన 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2019లో కేంద్రంలో బీజేపీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలను ఆర్థిక మంత్రిగా నియమించారు.



ముందడుగు
మంగళవారం,
23-7-2024,
హైదరాబాద్



# నిర్మాత దిల్ రాజు సూపర్ ఎస్కేప్

శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ నిర్మాణ సంస్థను స్థాపించి తెలుగులో ఎన్నోమంచి బ్లాక్ బస్టర్ చిత్రాలను నిర్మించాడు దిల్ రాజు. అయితే ఇటీవల శంకర్ దర్శకత్వం లో రూపొందిన భారతీయుడు-2 సినిమా ఎంతటి పరాజయం పాలైందో అందరికి తెలిసిన విషయమే. దాదాపు గా 28 సంవత్సరాల క్రితం దర్శకుడు శంకర్, విలక్షణ నటుడు కమల్ హాసన్ నటించిన భారతీయుడు చిత్రానికి సీక్వెల్ ఈ సినిమా అని తెలిసిందే. భారతీయుడు సినిమా అప్పట్లో భారీ విజయాన్ని సాధించింది.

అయితే ఇటీవల విడుదలైన భారతీయుడు-2 సినిమా ప్రేక్షకుల అంచనాలను అందుకోలేక పోయింది. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై సుభాస్కరన్ నిర్మించారు. అయితే నిర్మాత దిల్ రాజు మొదట్లో భారతీయుడు-2 చిత్రాన్ని ప్రొడ్యూస్ చేద్దాం అనుకున్నారు. దర్శకుడు శంకర్ కు అడ్వాన్స్ ఇవ్వడంతో పాటు సినిమా దిల్ రాజు నిర్మిస్తున్నట్లు అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. అయితే అత్యధిక బడ్జెట్‌తో పాటు కొన్ని కారణాల వల్ల కొన్ని కారణాల వల్ల భారతీయుకడు-2 సినిమాను నిర్మించడం నుంచి తప్పకోవాల్సి వచ్చింది.

ఆ తరువాత దర్శకుడు శంకర్ హీరో రామ్ చరణ్ కు చెప్పిన కథ నచ్చడంతో దిల్ రాజు `గేమ్ ఛేంజర్`కు నిర్మాతగా మారాడు. ముందుగానే `భారతీయుడు-2`సినిమా కోసం దిల్ రాజు దర్శకుడు శంకర్‌కు ఇచ్చిన అడ్వాన్స్ వుండటంతో శంకర్ -రామ్ చరణ్ కలయికలో వస్తున్న `గేమ్ ఛేంజర్`ను నిర్మించే అవకాశాన్ని దిల్ రాజు సొంతం చేసుకున్నాడు. అయితే భారతీయుడు-2 విడుదలై కమర్షియల్ గా డిజాస్టర్ అవ్వడంతో అందరూ దిల్ రాజుని ఓ భారీ నష్టం నుండి చాలా తెలివిగా తప్పించుకున్నాడు దిల్ రాజు అంటున్నారు. భారీ ఫ్లాప్ ను తన ఖాతాలో పడకుండా జాగ్రత్త పడ్డాడు అని నెటిజన్ల టాక్ . నిర్మాత దిల్ రాజు సూపర్ ఎస్కేప్ అని అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు.






# ప్రతి నిమిషం ఫోన్ చెక్ చేస్తున్నారా..

- అయితే మీరు పాప్‌కార్న్ బ్రెయిన్ బాధితులే
- వేగంగా వ్యాపిస్తున్న కొత్త సమస్య

ముందడుగు ప్రత్యేకం:
అందరి చేతుల్లో స్మార్ట్ పోన్.. ప్రతి చిన్న పనికి మొబైల్ వాడడం, మొబైల్ లో వెతకడం మామూలైపోయింది. స్మార్ట్‌ఫోన్‌ల నుంచి ల్యాప్‌టాప్‌ల వరకు, ప్రతిచోటా సమాచారంతో దూసుకుపోతున్నాం. ఇది మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో మీరు ఆలోచించి ఉండకపోవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ డిజిటల్ యుగంలో 'పాప్‌కార్న్ బ్రెయిన్' అనే కొత్త సమస్య వేగంగా అభివృద్ధి చెందుతోంది.

పాప్‌కార్న్ మెదడు అనేది మెదడు బలహీనమైన స్థితి. ఇది నిరంతరం ఒకదానిపై లేదా మరొకదానిపై దృష్టి కేంద్రీకరించే సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. అధిక సమాచారం తీసుకోవడం వల్ల ఇది జరుగుతుంది.

ఇందులో, మనస్సు ఒక విషయం నుంచి మరొకదానిపైకి దూకుతూనే ఉంటుంది. ఒక అంశంపై ఆలోచన స్థిరంగా ఉండదు. ఏదైనా ఒకే పనిపై ఏకాగ్రత పెట్టడంలో ఇబ్బంది తలెత్తుతూ ఉంటుంది.

## పాప్‌కార్న్ బ్రెయిన్ లక్షణాలు

### ఏకాగ్రత కష్టం:

పాప్‌కార్న్ బ్రెయిన్ సమస్య ఉన్నవారు ఒక పని మీద దృష్టి పెట్టడం కష్టం అవుతుంది. పదే పదే పరధ్యానంలో ఉంటారు. ఏదైనా పని పూర్తి చేయడంలో ఇబ్బందిని ఎదుర్కొంటారు. ఒక్కోసారి ఏదో ఒక సమాచారం మనసును చెదరగొడుతుంది. సోషల్ మీడియా నోటిఫికేషన్ లేదా మరొకరి మెసెజ్ వచ్చినప్పుడు చేస్తున్న పనిని వదిలివేసి.. దాన్ని చూడటానికి ఆసక్తి చూపిస్తారు.

### పనులు మరిచిపోవడం..

ఏకాగ్రత తక్కువగా ఉండటం కారణంగా ఏ పనినీ పూర్తి చేయడంలో సంతృప్తి పొందలేరు. పని ఇంకా అసంపూర్తిగానే ఉందని పదేపదే తెలుస్తుంది. తరచూ ఫోన్ చూడటానికి అలవాటు పడిపోయినందు వల్ల మెదడు చాలా సమాచారంలో చిక్కుకుపోతుంది. దీంతో ముఖ్యమైన పనులను కూడా గుర్తుంచుకోవడం కష్టం అవుతుంది.

## ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

బలహీనమైన ఏకాగ్రత కారణంగా, పని నాణ్యత, పరిమాణం రెండూ ప్రభావితమవుతాయి. అదనపు సమాచారం మనస్సుపై భారంగా మారుతుంది. దీని కారణంగా ఒత్తిడి, ఆందోళన పెరుగుతుంది. ప్రతి పనిలో వైఫల్యం చెందుతున్నామనే భావన మనసును కుంగదీసి నిరాశకు గురి చేస్తుంది. బలహీనమైన మానసిక స్థితి కారణంగా, ఇతరులతో అనుబంధం బలహీనపడవచ్చు. సంబంధాలలో చీలిక కూడా వచ్చే ప్రమాదం ఉంది.

## బీ కేర్ ఫుల్...

మీరు కూడా పాప్ కార్న్ బ్రెయిన్ లక్షణాలను అనుభవిస్తున్నట్లయితే... మీ డిజిటల్ అలవాట్లపై కాస్త శ్రద్ధ పెట్టండి. నోటిఫికేషన్ వచ్చినప్పుడు, ప్రతి సమాచారాన్ని వెంటనే చూడాల్సిన అవసరం లేదు. మనస్సును రిలాక్స్ చేయడానికి, ఎప్పటికప్పుడు విశ్రాంతి తీసుకోండి. నిశ్శబ్ద ప్రదేశంలో కొంత సమయం గడపండి.